క్లుప్తంగా

సెప్టెంబర్ 2న వైఎస్సార్ వర్ధంతి

టెక్కలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు సెప్టెంబర్ 2వ తేదీన టెక్కలిలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు బర్ల కార్తీక్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రఘునాథరావు

టెక్కలి రూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరమని టెక్కలి ఎస్‌ఐ–2 రఘునాథరావు అన్నారు. స్థానిక అరుణ విద్యాలయంలో విద్యార్థులకు వివిధ చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రధానంగా శక్తి యాప్, దాని వినియోగం గురించి వివరించారు. అలాగే గృహహింస, వరకట్నం వేధింపులు, పిల్లల మీద లైంగిక దాడులు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం తదితర వాటి గురించి తెలియజేశారు. అలాగే పిల్లలు ఎటువంటి నేరాలకు పాల్పడకూడదని, పరిచయం లేని వ్యక్తులు చెప్పిన తప్పుడు పనులు చేయకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన


బస్‌షెల్టర్‌కు శంకుస్థాపన చేస్తున్న పిరియా విజయ తదితరులు

కవిటి: మండలంలోని రాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి తోటూరు జంక్షన్, తదితర గ్రామాల ప్రజల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీపీ కడియాల పద్మ, కడియాల ప్రకాష్, వైస్ ఎంపీపీలు పి.నేతాజీ, కె.గోపయ్య, పి.శేఖర్, వై.అశోక్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


కళా వేదికను ప్రారంభిస్తున్న నాయకులు

కవిటి: గ్రామాల అభివృద్ధికి తమ పాలకవర్గం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎంపీపీ కడియాల పద్మ అన్నారు. మండలంలోని రాజపురం శ్రీశయన వీధి సమీపంలో శ్రీరామ కళావేదిక శిథిలావస్థకు చేరడంతో, దాని స్థానంలో మండల పరిషత్ నుంచి రూ.6 లక్షల నిధుల వ్యయంతో నిర్మించిన శ్రీరామ కళావేదిక నూతన భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి కడియాల పద్మ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పి.నేతాజీ, కె.గోపయ్య, నాయకులు సత్యనారాయణ పాఢి, జానకిరావు, కృష్ణారావు, ఢిల్లీబాబు, వెంకటరావు, ఈశ్వరరావు, అశోక్, నీలయ్య, శేఖర్, ధర్మా, సతీష్, పి.కృష్ణారావు, నారాయణస్వామి, పి.ఆనందరావు, రాంప్రసాద్, వై.సత్యం, డి.సతీష్, ధోనీ యాదవ్, అప్పన్న, ఆదినారాయణ, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామారావు

సోంపేట: నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు సూచించారు. కళాశాల ఆవరణలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. 5 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 112 మంది ఇంటర్వ్యూలకు హాజరవ్వగా, వీరిలో 43 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలు సాధించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పండి రామకృష్ణ, కళాశాల అధ్యాపక సిబ్బంది, ప్రైవేటు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

పలాస: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలాస బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పయ్యాజ్ మహ్మద్ చెప్పారు. పలాస విద్యా వాహిని జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె.దేవరాజు, డాక్టర్ కె.లోకేశ్వరరావు, అంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గిరిజనుల హక్కులు, బాల్య వివాహాలు తదితర అంశాలపై సలహాలు, సూచనలు అందజేశారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..!

వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి వివిధ ఆకృతుల్లో గణనాయకున్ని కొలువుదీర్చారు. యువత ఉత్సాహంతో ఒకరితో ఒకరు పోటీపడి విభిన్న ఆకృతుల్లో మండపాలను తీర్చిదిద్దారు. అనంతరం వినాయక వ్రతం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లను, ఇతర ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. విభిన్న రీతిలో కొలువుదీరిన గణనాథులను కుటుంబ సభ్యులతో సహా తరలివచ్చి తిలకించారు.

– సాక్షి నెట్‌వర్క్


వజ్రపుకొత్తూరు: బజారు వీధిలో...


వజ్రపుకొత్తూరు: పూండిలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద....


నందిగాంలో కొలువైన భారీ గణనాథుడు


మందస: భోయి వీధిలో కొలువుదీరిన గణనాథుడు


కంచిలి శివాలయం వద్ద...


సంతబొమ్మాళి: నౌపడలో కొలువుదీరిన వినాయకుడు


టెక్కలి: విజయ గణపతి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


టెక్కలి: చేరీవీధిలో...


టెక్కలి పట్టణంలో...


పలాస: కాశీబుగ్గ పెట్రోలు బంకు సమీపంలో...


పలాస: మామిడిపల్లి గ్రామంలో...



వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురం గ్రామంలో...


కవిటిలో జగన్నాథస్వామి ఆకృతిలో గణనాథుడు


సోంపేట: బారువ ప్రధాన రహదారి వద్ద...


సోంపేట: జలంత్ర హరిజనవీధిలో...


ఇచ్ఛాపురం: ఆస్పత్రి రోడ్డులో...


సోంపేట: యశోద నగర్‌లో...

జనార్ధన మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న సీదిరి అప్పలరాజు తదితరులు

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ చింత జనార్ధనరావు(75) మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురం గ్రామంలోని స్వగృహంలో గురువారం ఆయన చెందడంతో, భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశవరావు, మండల పార్టీ అధ్యక్షుడు తిర్రి రాజారావు, పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ చింత హేమారావు, దున్న బాలరాజు, బత్తిన హేమేశ్వరరావు, జి.విశ్వనాథం, డి.దాలయ్య తదితరులు ఉన్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

నందిగాం: మండలంలోని కొత్తగ్రహారానికి చెందిన బొందేటి తులసయ్యపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ చిన్నారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బొండేటి తులసయ్య, చోళ దాలయ్య గ్రామంలో ఉన్న చెరువు వద్ద స్నానం చేసేందుకు వెళ్లారు. కొద్దిరోజుల క్రితం గ్రామంలో ఘర్షణ పడిన వీరిద్దరూ చెరువు వద్ద మరోసారి గొడవపడ్డారు. దీంతో తులసయ్య కర్రతో కొట్టగా దాలయ్యకు గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయాలపాలైన దాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత


కవిటి: ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రకాష్


వజ్రపుకొత్తూరు: ఆర్థిక సాయం అందజేస్తున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు

కవిటి: మండలంలోని శిలగాం పంచాయతీ గుజ్జుపుట్టుగకు చెందిన ఎం.దుర్గారావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గురువారం ఈ మేరకు బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొర్రాయి గోపాల్, నారాయణ, దానయ్య, మేఘనాథం తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రోడ్డు ప్రమాదంతో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తికి వైద్యం నిమిత్తం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు రూ.12 వేల ఆర్థిక సాయం చేశారు. మండలంలోని చిన డోకులపాడు గ్రామానికి చెందిన ఎం.దుర్గాప్రసాద్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమై బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టడంతో వైద్యం పొందుతున్నారు. దీంతో విషయం తెలుసుకున్న సొసైటీ వ్యవస్థాపకుడు కీలు విజయ్‌కుమార్ అతని బృందంతో కలిసి దుర్గా ప్రసాద్ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డి కరుణాకర్, ఎంపీటీసీ సభ్యుడు కె.డిల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఎ.రామకృష్ణ, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు ఎస్.కిరణ్, బి.మోహనరావు, పాపారావు, రాజేష్‌కన్నా, గాయత్రి, నందు, హరిత, అబ్బాయవర్మ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై పట్టు సాధించాలి


మాట్లాడుతున్న కళాశాల డైరక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికతపై పట్టు సాధించాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు సూచించారు. గురువారం కళాశాలలో ఇంటర్నల్ హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిజైన్ థింకింగ్, ఐడియేషన్, ప్రోటోటైపింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఏ–1 క్వాంటమ్ కంప్యూటింగ్, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ తదితర విభాగాల్లో విద్యార్థుల బృందాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కన్వీనర్ బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డొంకపుట్టుగలో టాలెంట్ టెస్ట్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని కవిటి పంచాయతీ పరిధి డొంకపుట్టుగలో గురువారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పదో తరగతి, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో తొలి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గ్రామ పెద్దలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి


కంచిలి: విద్యుత్ శాఖ కార్యాలయం ముందు నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు


మందస: ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఎం నాయకులు


పలాస: సామూహిక ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పలాస: ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపుతోందని, దీనికి వ్యతిరేకంగా పోరాడాలని, బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త ప్రజాసంఘాల పిలుపులో భాగంగా గురువారం కాశీబుగ్గ మహాత్మ గాంధీ విగ్రహం వద్ద సామూహిక ప్రతిజ్ఞ దినాన్ని పాటించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎస్.గణపతి, లిబరేషన్ నాయకుడు తామాడ సన్యాసిరావు, సీహెచ్ రవి, ఎం.వినోద్, టి.అజయ్‌కుమార్, మద్దిల రామారావు, టి.రాజు, జి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మందస: బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పలువురు ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రవ్యాప్త ప్రజా సంఘాల పిలుపులో భాగంగా మండలంలోని రాధాకృష్ణపురం గ్రామంలో సీఐటీయూ భవనం వద్ద సామూహిక ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పి.దేవేంద్ర, కె.కేశవరావు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారం మోపి, అదానీ స్మార్ట్ మీటర్లతో కార్పొరేట్లకు ఊడిగం చేస్తుంటే పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని, ఇప్పటికే పెంచిన సర్ చార్జీలు, ఇందనపు చార్జీల వసూళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.ధర్మారావు, దుర్యోధన, కె.కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ముందుకెళ్దామని సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు లండ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సాలిన నారాయణస్వామిలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ముందు బషీర్ బాగ్ ఉద్యమ స్ఫూర్తితో కొత్త విద్యుత్ సంస్కరణలపై పోరాడుతామని గురువారం నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అయినింటి లోకనాథం, జన్ని సోమేష్, కర్తలి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేత హరిపురం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని కమలాయిపుట్టుగ గ్రామంలో గురువారం నిర్వహించిన సీరపు మోహనరావు, రామలక్ష్మి స్మారక క్విజ్ పోటీల్లో విజేతగా హరిపురం గీతం హైస్కూల్ జట్టు నిలిచింది. జిల్లావ్యాప్తంగా 63 జట్లు పాల్గొనగా వీటిలో స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా 10 జట్లు తుది పోటీకి అర్హత సాధించాయి. ఇందులో హరిపురం గీతం హైస్కూల్ ప్రథమ, హరిపురం జెడ్పీహెచ్ స్కూల్ ద్వితీయ స్థానం, బొరివంక జెడ్పీహెచ్ స్కూల్ తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు కవిటి, ఇచ్ఛాపురం మండలాల ఎంఈవోలు ధనంజయ మజ్జి, సున్నాముద్ది విశ్వనాథంలు బహుమతులు అందించారు.